AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

దుర్గాదేవి నమోస్తుతే..







ఎల్లారెడ్డిలో ఘనంగా బతుకమ్మ

## మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** మక్క కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బడా భీమ్‌గల్ నుంచి అక్లూర్ వెళ్లే దారిలో రోడ్డుపై ఆరబోసిన మక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నిజానికి మక్కలను క్వింటాల్‌కు రూ. 2,800 ధర రావాల్సి ఉండగా ప్రభుత్వం స్పందించకపోవడంతో దళారులకు రూ.1,600 రైతులు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. వెంటనే కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.






## నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 1,03,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. సింగూరు నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో నిజాంసాగర్‌కు భారీగా వరద పోటెత్తింది. 17 గేట్లు ఎత్తి అధికారులు 99,470 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రధాన కాలువకు 900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1400 అడుగుల (11.5 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో అధికారులు పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడం లేదు.

### మంజీర వరద ఉధృతి

మంజీర ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నిజాంసాగర్ ఎగువన మెదక్ జిల్లాలో గల ఏడుపాయల దుర్గమ్మ ఆలయం జలదిగ్బంధంలోనే ఉంది. వన దుర్గా భవాని ఆలయం మూసి ఉంది. దీంతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి రాజగోపురంలో పూజలు చేస్తున్నారు. శరన్నవరాత్రి వేడుకలు సైతం రాజగోపురంలోనే నిర్వహిస్తున్నారు.



## శ్రీరాంసాగర్‌కు ఉధృతంగా వరద..

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద ఉధృతంగా వస్తోంది. గత వారం రోజులుగా ప్రాజెక్ట్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. మహారాష్ట్ర, స్థానికంగా కురిసిన వర్షాలతో గోదావరికి భారీగా వరద వస్తోంది. దీంతో ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 3.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు 39 వరద గేట్లు ఎత్తి 3 లక్షల క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4 వేలు, సరస్వతి కాలువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. మిషన్ భగీరథకు 231, ఆవిరి రూపంలో 600 క్యూసెక్కులు పోతోంది. మొత్తంగా 3,09,231 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ, లక్ష్మి కాలువ, ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదలను నిలిపి వేశారు. శ్రీరాంసాగర్ లోకి ఎగువ నుంచి భారీగా వరద రావడంతో అధికారులు నిన్నటి వరకు దిగువకు భారీగా నీటిని విడుదల చేశారు. ఇన్ ఫ్లో కంటే ఔట్ ఫ్లో అధికంగా ఉండేలా చర్యలు చేపట్టారు. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా తగ్గిపోయింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1084.3 అడుగుల (57.6 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

## కానిస్టేబుల్ సస్పెన్షన్




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురయ్యారు. కానిస్టేబుల్ గంగాప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. స్టేషన్‌లో గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని బయటకు చెబుతుండడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది.

“భారీ వర్షాలతో అతలాకుతలమైన జిల్లాను ఆదుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ నెల రోజులు దాటినా ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ఆగస్టు 26, 27 తేదీల్లో జిల్లాలో కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. అనేక ప్రాంతాలను వరద ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వరద ప్రభావిత ప్రాంతాలను సీఎం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. మరోసారి కామారెడ్డికి వచ్చి బాధితులను పరామర్శించారు. అధికారులతో సమీక్షించి వరద నష్టం అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. అధికారులు అంచనాలు పంపినా ఇప్పటికి నిధులు మంజూరు కాలేదు.

- అక్షరటుడే, కామారెడ్డి



# వరద సాయం లేనట్టేనా?

- సీఎం సమీక్షించినా విడుదల కాని నిధులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వరల్డ్ బ్యాంకుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే లేఖతో కలకలం

జిల్లాను వినాయక చవితి రోజున వరద ముంచెత్తింది. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలు వరదలతో తీవ్రంగా నష్టపోయాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పంటలు, చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు రహదారులు దెబ్బతిన్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. జాతీయ రహదారి సహా పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నాయి. పట్టణంలోని జీఆర్ కాలనీ, కౌండిన్య కాలనీ, హౌజింగ్ బోర్డు, బతుకమ్మ కుంట, రుక్మిణి కుంటలు నీట మునిగాయి. భారీగా ఆస్తి నష్టం సభవించింది. జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టుగా ప్రాథమికంగా అంచనా వేశారు. విద్యుత్ లైన్లు తెగిపోయాయి. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి.

### ప్రతిపాదనలు పంపినా...

వరదలు ముంచెత్తిన మరుసటి రోజు మంత్రి సీతక్క పట్టణంలోని జీఆర్ కాలనీలో పర్యటించి అధికారులతో సమీక్షించారు. ఏరియల్ సర్వే ద్వారా వరద నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. 31న ఎమ్మెల్సీల బృందం పర్యటించి ప్రత్యేక ప్యాకేజీ కోసం సీఎంకు నివేదిస్తామని వెల్లడించింది. సెప్టెంబర్ 4న స్వయంగా ముఖ్యమంత్రి కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి అంచనాలు తయారు చేసి పంపించాలని ఆదేశించారు. దీంతో అధికారులు రూ.250 కోట్లకు పైగా ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. సీఎం వచ్చినా ఒక్క రూపాయి నిధులు రాకపోవడంపై జిల్లా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రపంచ బ్యాంక్‌కు ఎమ్మెల్యే లేఖ

వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వరద సాయం ప్రకటించాని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పలుమార్లు మంత్రులు, సీఎంను కోరారు. ఇటీవల ఆయన వరల్డ్ బ్యాంకుకు ఎమ్మెల్యే లేఖ రాశారు. నియోజకవర్గంలో వరదలతో దెబ్బతిన్న రోడ్లు, ఇళ్లు, పంటల ఇతర అవసరాల కోసం రూ.100 కోట్ల సాయం కావాలని ఆయన కోరారు. ఈ మేరకు వరల్డ్ బ్యాంక్ గ్లోబల్ ఫెసిలిటీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ అండ్ రికవరీ (జీఎఫ్‌డీఆర్ఆర్) కి లేఖ రాశారు. ఎమ్మెల్యే రాసిన లేఖపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకం లేకనే వరల్డ్ బ్యాంకుకు లేఖ రాశారా అని ప్రతిపక్షాలు నిందిస్తున్నాయి. మరోవైపు సొంత పార్టీ నాయకులు మాత్రం నియోజకవర్గ అభివృద్ధిపై లేఖ రాస్తే తప్పేంటి అనే వాదిస్తున్నారు.

### సమీక్ష చేయని సీఎం

సెప్టెంబర్ 4న కామారెడ్డిలో అధికారులతో సీఎం సమీక్షించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో హైదరాబాద్‌లో 15 రోజుల్లో సమీక్షిస్తానని చెప్పారు. ఇప్పటికి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయలేదు. దాంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం మరోసారి సమీక్షించి వరద సాయం ప్రకటించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



## గ్రూప్–1 ర్యాంకర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఇందూరు:** గ్రూప్-1లో 386 ర్యాంకు సాధించి, ఉద్యోగానికి ఎంపికైన నిజామాబాద్‌కు చెందిన నిఖిత రెడ్డి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం క్యాంపు కార్యాలయానికి వెళ్లి కలవగా.. నిఖిత రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన నిఖిత ఇరిగేషన్ శాఖలో ఏఈగా ఉద్యోగం సాధించిందన్నారు. అంతటితో ఆగకుండా గ్రూప్ వన్‌లో డీఎస్పీగా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఆమెను సన్మానించారు.

## మద్యం దుకాణాలకు ఏడు దరఖాస్తులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో మద్యం దుకాణాలకు మంగళవారం ఏడు దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. 2025-2027 సంవత్సరాలకు గాను షాపుల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. నిజామాబాద్ నగర పరిధిలో 2, నవీపేట్ 1, ఆర్మూర్ పరిధిలోని ఆలూర్ 1, బాల్కొండ 1, భీమ్‌గల్ స్టేషన్ పరిధిలోని ఇందల్వాయి 1, మోర్తాడ్ స్టేషన్ పరిధిలోని ఏర్గట్లలో 2 వచ్చినట్లు తెలిపారు. మొత్తంగా జిల్లాలో ఇప్పటి వరకు మద్యం దుకాణాల కోసం 9 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన స్పష్టం చేశారు.

## భార్య అన్నం పెట్టలేదని అలిగి కరెంట్ పోల్ ఎక్కిన భర్త

**అక్షరటుడే, సిరికొండ :** ఇంట్లో భార్య అన్నం పెట్టలేదని అలిగి కరెంట్ స్తంభం ఎక్కాడు ఓ భర్త. ఈ ఘటన సిరికొండ మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలం చీమన్‌పల్లి గ్రామానికి చెందిన అలకుంట సుమన్ వడ్డెర వృత్తి చేస్తూ జీవిస్తున్నాడు. అయితే మంగళవారం ఇంట్లో భార్యతో జరిగిన గొడవ కారణంగా ఆమె అతడికి భోజనం పెట్టలేదు. దీంతో అలిగిన భర్త సుమన్ తాగిన మైకంలో గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కాడు.స్పందించిన స్థానికులు ఎంత నచ్చజెప్పినా వినలేదు. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడికి నచ్చజెప్పి కిందికి దించారు. దీంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం చేయవచ్చని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా, న్యూ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లను మంగళవారం కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్యరెడ్డితో కలిసి పరిశీలించారు. న్యూ బస్టాండ్ నుండి లింగంపేట్, ఎల్లారెడ్డి వైపు వాహన రాకపోకలు సాఫీగా సాగేలా ట్రాఫిక్ సిగ్నళ్లను తనిఖీ చేశారు. ఇకపై వాహనదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ట్రాఫిక్ ఎస్సై మహేష్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యత అని, సమిష్టి కృషితోనే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఎస్పీ సూచించారు. రాంగ్ రూట్, అశ్రద్ధగా డ్రైవ్ చేయడం ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. డ్రంకన్ డ్రైవ్‌పై కఠినచర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. అధిక వేగంతో డ్రైవ్ చేయకూడదన్నారు. సీసీ టీవీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణ సాగుతుందని ఎస్పీ తెలిపారు. ముఖ్యమైన ట్రాఫిక్ ఉల్లంఘనలు, సిగ్నల్ జంపింగ్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, రాష్ డ్రైవింగ్ లాంటివి చేస్తే వాహనదారులకు ట్రాఫిక్ చలాన్లు విధిస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై నరేశ్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

**అక్షరటుడే ఇందూరు:** స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించేలా అన్ని విధాలా సన్నద్ధం కావాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో ఎంపీడీవో, ఎంపీవోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని.. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురిచేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరిచూసుకోవాలని సూచించారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కోసం రెవెన్యూ డివిజన్ కేంద్రాల వారీగా కౌంటింగ్ గుర్తించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిజ్ఞాన్ మాల్వియా, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, జడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్ మందిరంలో మంగళవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతాయని వివరించారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సైతం ఇప్పటికే నియయించినట్లు స్పష్టం చేశారు. పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన పోస్టర్లు, హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగించనున్నట్లు చెప్పారు.

జిల్లాలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. పోస్టర్లు, హోర్డింగ్స్, ప్రకటనల కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికలకు సంబంధించి ఆర్డీవో నుంచి.. సర్పంచ్, వార్డు మెంబర్లకు తహశీల్దార్ నుంచి అనుమతి పొందాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 5 వేల పైన ఉన్న జనాభా ప్రాంతాల్లో రూ.2.5 లక్షలు, 5 వేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో రూ.1.5 లక్షలు అభ్యర్థుల ఖర్చుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సర్పంచ్‌లకు రూ.50 వేలు, వార్డు సభ్యులకు రూ.30 వేలు వరకు ఖర్చు చేయవచ్చన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారుల వద్ద రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలకు 48 గంటల ముందుగానే ప్రచారం నిలిపివేయాలని చెప్పారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



## డ్రగ్స్ రహిత సమాజం కోసం 'జన చైతన్య బైక్‌యాత్ర'

**అక్షరటుడే, కామారెడ్డి:** డ్రగ్స్, గంజాయి రహిత సమాజం కోసం తనవంతు ప్రయత్నం చేస్తున్నానని సూర్యాపేట ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజం కోసం చేపట్టిన రాష్ట్రవ్యాప్త జనచైతన్య బైక్ యాత్ర మంగళవారం మధ్యాహ్నం కామారెడ్డి పట్టణానికి చేరుకుంది. యాత్రకు ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, స్వామి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబీర్ శ్యాంరావు స్వాగతం పలికి ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తన స్నేహితుడు విపరీతమైన ధూమపానానికి అలవాటు పడి మృతి చెందాడని.. దీంతో తాను తీవ్రంగా కలత చెందానన్నారు. అతనికి జరిగినట్టుగా మరొకరికి జరగకూడదని జనచైతన్య యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో మహానగరాలకు మాత్రమే పరిమితమైన డ్రగ్స్, గంజాయి పచ్చని పల్లెలకు వ్యాపించి ప్రశాంతత లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులే కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు.



## సీఎంఆర్ఎఫ్‌తో పేదప్రజలకు భరోసా

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** సీఎంఆర్ఎఫ్ ద్వారా అనారోగ్యంతో చికిత్స పొందిన పేదలు, మధ్యతరగతి వారికి భరోసా లభిస్తుందని టీపీసీసీ అధికార ప్రధినిధి వేణుగోపాల్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని హాసాకొత్తూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలోని చిన్నసాయన్నకు రూ. 44,000, కేతావత్ జ్యోతికి రూ.27,000, వేముల లతకు రూ.16,000, నలిమెల పద్మకు రూ.60,000, నాయిని పూర్ణిమకు రూ.8,000, రేగురి లక్ష్మీరాజ్యంకు రూ.15,000 విలువైన చెక్కులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెక్కులు మంజూరు చేయించిన బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, నాయకులు రేవతి గంగాధర్, ఏనుగు మనోహర్, ఎడ్ల శ్రీకాంత్, మోహన్ నాయక్, శ్రీధర్, రాజేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.



## రూరల్ ఎమ్మెల్యేను పరామర్శించిన ప్రముఖులు

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తల్లి నరసమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే.. ఆమె అంత్యక్రియలు మంగళవారం నగర శివారులోని గూపన్‌పల్లి వైకుంఠధామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రముఖులు ఎమ్మెల్యే తల్లి నరసమ్మ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాటిపల్లి నగేష్ రెడ్డి, శేఖర్ గౌడ్ ఉన్నారు.

## అధ్వానంగా రోడ్డు.. ప్రయాణికులకు పాట్లు

**అక్షరటుడే, పెద్దగొడప్‌గల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పెద్ద కొడప్‌గల్ మండలంలోని చావని తండా నుంచి మన్సూరం తండా వరకు రోడ్డు పూర్తిగా నీళ్లతో నిండిపోయింది. వారంరోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా కొట్టుకుపోయి అధ్వాన స్థితికి చేరింది. బాన్సువాడ వెళ్లేవారు ఈ దారిగుండానే వెళ్తుంటారు. వారంరోజుల క్రితం కంగ్టి మండంలోని ఎడ్ల రేగడి తండా జ్వాలాముఖి మాత మందిరంలో దసరా సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అయితే ఈ ఉత్సవాలకు ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర నుంచే కాకుండా బాన్సువాడ ప్రాంతవాసులు తరలివచ్చారు. కానీ రోడ్డు అధ్వానంగా ఉండడంతో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. వెంటనే ఈ రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.





డోంగ్లిలో..



పెద్ద కొడప్‌గల్ మండలంలో..




డోంగ్లిలో..

## దుర్గాదేవి నమోస్తుతే..

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే ఉదయం యజ్ఞాలు జరిగాయి. సాయంత్రం వేళ మండపాల్లో పుష్పాలంకరణ, దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తితో నైవేద్యాలు సమర్పించారు. దుర్గామాత ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

– అక్షరటుడే, నెట్‌వర్క్



ఆర్యవైశ్య సంఘం అమ్మవారి అలంకరణ



బాన్సువాడలో..



ఆర్మూర్‌లో..



బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర్ కాలనీలో..



కోటగిరిలో..

## ఏజెన్సీకి బిల్లులు తగ్గించడాన్ని ఖండిస్తున్నాం..



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏజెన్సీలకు బిల్లులు తగ్గించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం బాన్సువాడ ఏరియా ఆస్పత్రి, ఎంసీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. బాన్సువాడ పట్టణంలో ఏరియా ఆస్పత్రి, ఎంసీఎచ్ ఆస్పత్రి కలిపి 200 పడకలు ఉండగా 150 పడకలకు సంబంధించి ఏజెన్సీకి ప్రభుత్వం బిల్లులు చెల్లించారన్నారు. ఇటీవల తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారులు బాన్సువాడ ఆస్పత్రి ఇన్ పేషంట్, అవుట్ పేషంట్‌లలో 75 శాతం సెన్సెస్ తక్కువగా ఉందనే తప్పుడు సమాచారంతో 150 పడకలకు బిల్లులు కుదించారని ఆయన మండిపడ్డారు. ఆస్పత్రి నుంచి తప్పుడు రిపోర్టులు పంపడం వల్లే సమస్య ఎదురైందని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేణుక, ధనుంజయ్, లక్ష్మణ్, మహేందర్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## యూపీహెచ్‌సీలో ఆరోగ్యశిబిరం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని వినాయక్ యూపీహెచ్‌సీలో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. . డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంజన ఆధ్వర్యంలో సుమారు 160 మందికి వైద్య పరీక్షలు చేశారు. 46మందికి గైనిక్ సంబంధిత పరీక్షలు నిర్వహించగా.. 39 మందికి కంటి పరీక్షలు చేశారు. 80 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ తుకారాం రాథోడ్, మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ రవితేజ, వైద్యులు శ్రీజ, హెచ్‌వో వెంకట్ రవి, సుకన్య, సీఈఓ ఆనంద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలందించాలి



**అక్షరటుడే, గాంధారి:** అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లను ఆశ్రయించేవారికి మెరుగైన సేవలందించాలని 108,102 అంబులెన్స్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి అన్నారు. మంగళవారం గాంధారి మండల కేంద్రంలో 108, 102 అంబులెన్స్ పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్ వాహనంలో ఆక్సిజన్ సిలిండర్, వైద్య పరికరాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవల కోసం ఈ తనిఖీ చేపట్టామన్నారు. సిబ్బంది సురేష్, ప్రకాష్ గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి మండలంలో..



పెద్దకొడప్ గల్ మండలంలో..

## ఎల్లారెడ్డిలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

సద్దుల బతుకమ్మ సంబరాలు ఎల్లారెడ్డి మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మహిళలు తంగెడు, గునుగు, బంతి పూలతో బతుకమ్మలను పేర్చారు. ఒక్కేసి పువ్వేసి చందమామ.. రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడారు. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలు పెట్టి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. చిన్నారులు, యువతులు, మహిళలు కోలాటం ఆడారు. అనంతరం గ్రామ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

–అక్షరటుడే, ఎల్లారెడ్డి

## రోడ్ల పక్కన ముళ్లపొదల తొలగింపు

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూరు మండలంలోని తిమ్మాపూర్ నుంచి బస్వాపూర్ వరకు రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ్లలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలున్నాయి. దీంతో బీర్కూర్ మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ స్పందించారు. తిమ్మాపూర్ నుంచి బస్వాపూర్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగింపజేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ద్రోణవల్లి సతీష్ మాట్లాడుతూ.. కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగినప్పటికీ అధికారులు, స్థానిక నాయకులు స్పందించలేదన్నారు. దీంతో తాను స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాటిని తొలగింపజేశానని స్పష్టం చేశారు.





## రెంజర్లలో మహాజన సభ

**అక్షరటుడే, బాల్కొండ:** రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం సొసైటీ భవనంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సభకు సంఘం ఛైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధికి అన్నివిధాల కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ ఛైర్మన్ ముస్కు సంతోష్ రెడ్డి, సెక్రటరీ కె గంగాధర్, డైరెక్టర్లు క్యాతం గంగారెడ్డి, బుయ్య రాజన్న, దాసరి నర్సయ్య, బద్ది ప్రసాద్, బద్దం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోరాడాలి

**అక్షరటుడే, కోటగిరి:** జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని దిశ కమిటీ సభ్యుడు, కోటగిరి మండల బీజేపీ ఇన్‌ఛార్జి కొండా ఆశన్న పేర్కొన్నారు. కోటగిరి బీజేపీ మండలాధ్యక్షుడు ఏముల నవీన్ ఆధ్వర్యంలో కోటగిరిలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగిరి మండలానికి స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌ఛార్జిగా నియమితులైన కొండ ఆశన్న మాట్లాడుతూ.. అక్టోబర్‌లో జరుగనున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పిల్లల మోహన్ రావు దేశాయ్, శ్యామల, మామిడి శ్రీనివాస్ రెడ్డి, రాజు, కొత్తపల్లి సాయి, వడ్ల శ్యాం, ఎల్లుట్ల గజేందర్, నాగరాజు, విలాస్ రావు, విఠల్, మోహన్, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.




## మచ్చర్లలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలం మచ్చర్ల గ్రామ యువత ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ టోర్నీలో మొత్తం 24 జట్లు పాల్గొని ప్రతిభ చూపాయి. ఫైనల్‌లో పడ్కల్ తండా జట్టు విజేతగా నిలవగా, మచ్చర్ల జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.8,888 నగదు బహుమతిని గ్రామవాసి షేక్ సమీర్ స్పాన్సర్ చేయగా, రన్నరప్ జట్టుకు వెల్మ రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. టోర్నీలో సమీర్, ఉప్పు గంగారెడ్డి, కొర్వ ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలపై కార్యాచరణ ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** పంచాయతీ ఎన్నికలపై కార్యాచరణపై ప్రారంభించినట్లు ఎంపీడీవో గంగాధర్ పేర్కొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. ఆర్మూర్ డివిజన్ పరిధిలో పంచాయతీ ఎన్నికలు దశలవారీగా జరుగనున్నాయని తెలిపారు. ఫేజ్ 2లో మండల పరిషత్ ఎన్నికలు, ఫేజ్ 3లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలు, భద్రతా బందోబస్తు, సిబ్బంది నియామకాలు వంటి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు.